



కలెక్టరేట్‌లో 13న పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈనెల 13వ తేదీన జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం భోగి పండగకు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.



కాణిపాకంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



వరదరాజస్వామికి గ్రామోత్సవం

ఐరాల(కాణిపాకం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజ స్వామి ఆలయంలో ఈ వేడుకలు జరిగాయి. ఉదయం స్వామికి ఈవో పెంచలకిషోర్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో పరదాలతో ఉత్తర ముఖంతో ద్వారం ఏర్పాటు చేశారు. శ్రీదేవి,భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవర్లను కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకుడు శ్రీనివాసభట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

చిత్తూరు కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పలు దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయాల పరిసరాలన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి.

మినీ గోకులాలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మినీ గోకులాలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారు. జిల్లాకు మొత్తం 2,162 గోకులాలు మంజూరవగా, పశుసంవర్థక శాఖ అధికారులు 2,040 గ్రౌండింగ్ చేశారు. వీటిలో ఇప్పటివరకు 244 గోకులం షెడ్లు పూర్తి చేశారు. శుక్రవారం నగరి నియోజకవర్గం నెట్టేరి పంచాయతీ పాళ్యం గ్రామంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో టీడీపీ ఇన్‌చార్జి చల్లాబాబులు మినీ గోకులాలను ప్రారంభించారు. శనివారం పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మురళీ మోహన్, గురజాల జగన్మోహన్‌ప్రారంభించనున్నారు.

జిల్లాకు రూ.70.47లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు

చిత్తూరు సెంట్రల్,జనవరి10(ఆంధ్రజ్యోతి): జిల్లాకు రూ.70.47లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పలమనేరు టెర్రకోటలోని సీఎఫ్‌సీ ప్రాంగణాల్లో వాష్‌రూం నిర్మాణాలకు రూ.2.06 లక్షలు, ఫాంమెకనైజేషన్‌కు రూ.17.51లక్షలు, బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్ల ఆధునికీకరణకు రూ.36.28లక్షలు, తవణంపల్లె మండలం ఎం.బోయపల్లె మాదవరంలో ఎస్వీఎస్ ఆగ్యుమెంటేషన్‌కు రూ.7.38లక్షలు మంజూరైంది.

ఇల వైకుంఠం

పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ

- వివరాలు 8లో -





కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు

● కలెక్టర్ సుమిత్ కుమార్



కోడిపందేల నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహించటం చట్ట రీత్యానేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ కోడి పందేల నిషేధంపై ముద్రించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించినా, పాల్గొన్నా క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

21న ఏకసభ్య కమిషన్ విచారణ

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణపై ఈనెల 21వ తేదీన చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా బృందం విచారణ చేపట్టనుంది. ఈ విచారణకు జిల్లాలోని ఎస్సీ కులాలు, పౌరుల నుంచి సిఫార్సులను స్వీకరిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

16న ఐటీఐలో మెగా జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాకు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో శిక్షణ పూర్తిచేసి పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటీస్ ఐటీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, లేదా తమ కార్యాలయంలో జరిగే మేళాకు నేరుగా హాజరుకావాలని కోరారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90306 57957 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఇరువర్గాల ఘర్షణ : నలుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం





ప్రసన్నయ్యగారిపల్లెలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు - కత్తిపోట్లుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం

పుంగనూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ విషయంపై ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రభుత్వ భూమి కబ్జా చేశారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు తహసీల్దార్ రాముతోపాటు అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఆ శ్రీనివాసులు తమ కుటుంబసభ్యులు జగదీశ్, శివలతో కలిసి గ్రామస్తులతో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంను శ్రీనివాసులు కత్తితో కడుపుపై పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆంజప్ప కుమారుడు చంద్రశేఖర్, రెడ్డెప్ప కుమారుడు ఆనంద్, రాజేంద్రలు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కత్తిపోటుకు గురైన సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉందని, డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించారు. విషయం తెలుసుకున్న పుంగనూరు సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





కొబ్బరి చెట్టును ధ్వంసం చేసిన ఏనుగులు - టమోటా పంటను నాశనం చేసిన ఏనుగు

పొలాలపై 13 ఏనుగుల గుంపు దాడి

● భయాందోళనలో రైతులు



మామిడి కొమ్మలను ధ్వంసం చేసిన గజరాజులు

బంగారుపాళ్యం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎగువ కంతలచెరువు పొలాలపై 13 ఏనుగుల గుంపు దాడి చేస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి కూడా గ్రామానికి చెందిన శంకరయ్య, నాగభూషణం, దేవేంద్ర, గురుమూర్తిలకు చెందిన పంటలను తొక్కినాశనం చేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో మోహన్ మురళి శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టాన్ని అంచనా వేశారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి 13 ఏనుల గుంపు వచ్చి ఉంటుందని, అలాగే వెలుతురుచేను ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తోందన్నారు. ట్రాకర్లు, అటవీ సిబ్బంది గస్తీ కాస్తూ వాటి కదలికలను తెలుసుకుంటున్నామన్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో ఉన్న రైతులు రాత్రి వేళల్లో జాగ్రత్తలు పాటించాలని, గుడిసెల్లో నిద్రించరాదని హెచ్చరించారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

● సహకరించిన ప్రియుడికి కూడా



పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు లీగల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్తను చంపేసింది. ఈ కేసులో భార్య, ప్రియుడికి చిత్తూరు న్యాయస్థానం జీవితఖైదు విధించింది. చిత్తూరు అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు సొంతంగా లారీలు కొని బయటి ప్రాంతాలకు వెళుతుంటాడు. ఈయన వద్ద రొంపిచెర్ల మండలం మొరవపల్లెకు చెందిన బాబులాల్ తమ్ముడు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. బాబులాల్ అప్పుడప్పుడు తన తమ్ముడి కోసం అంబేడ్కర్ నగర్‌కు వస్తూ శ్రీనివాసులు భార్య లక్ష్మితో పరిచయం పెంచుకున్నాడు. అదికాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. 2017 సెప్టెంబరు 11వ తేదీన బాబులాల్, లక్ష్మిలు ఇంట్లో ఉండగా భర్త గమనించాడు. తమ విషయం తెలియడంతో శ్రీనివాసులును లక్ష్మి, బాబులాల్ కలిసి రాడ్డుతో కొట్టి చంపేశారు. కేసు నమోదు చేసిన చిత్తూరు రెండో పట్టణ పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం ఎనిమిదో అడిషనల్ జిల్లా కోర్టులో వాయిదాకురాగా నేరం రుజువైంది. దీంతో నిందితులకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుంకర శ్రీదేవి తీర్పు చెప్పారు. ఈ కేసును ఇన్‌చార్జి పీపీ రవీంద్రనాథరెడ్డి వాదించారు.







ఉపలోకాయుక్త రజనికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో - అడిషనల్ డీజీపీకి జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు - దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్, ఏసీ చిట్టెమ్మ

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు



స.హ చట్టం కమిషనర్ చావలిసునీల్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం),జనవరి10(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్, రాష్ట్ర అడిషినల్ డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ కృష్ణమోహన్, ఏపీ సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈపై సీఎం కార్యాలయానికి ఉద్యోగిని ఫిర్యాదు

● అవమానకరంగా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నారని జేసీ వద్ద ఆవేదన

చిత్తూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈపై ఓ ఉద్యోగిని సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆర్ అండ్‌బీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) తనను అవమానకరంగా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నాడని ఏఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని ఆరోపించారు. ఈ మేరకు సీఎం కార్యాలయంతోపాటు కలెక్టర్, ఇంజనీర్‌ఇన్‌చీఫ్(ఆర్‌అండ్‌బీ),ఎస్పీ, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరిని కలసి తన సమస్యను వివరించారు. 'డిప్యూటీ ఎస్ఈ నా విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. చాంబర్‌కు పిలిచి దుర్భాష లాడుతూ, కాంట్రాక్టర్ల ముందు ఫైల్స్‌ను మొహంమీద విసిరి కొడుతున్నారు. ఆఫీస్ సమయం ముగిశాక నన్ను మాత్రమే ఇంటికి వెళ్లేటపుడు చెప్పి వెళ్లాలని ఆదేశిస్తున్నారు. ఇంటికెళ్లాక నా చాంబర్‌లోని ఫైళ్లు కనపడకుండా చేస్తున్నారు. రోజూ పిలిచి ఏదో ఒక కారణంతో తిడుతున్నారు' అని ఆ ఉద్యోగిని జేసీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఇదే ఎస్ఈ గతంలో విధులు నిర్వహించిన ప్రాంతంలో కూడా తమను వేధిస్తున్నారని పలువురు మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయని సదరు ఉద్యోగిని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



రుణమేళా కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘ సభ్యులు



మహిళా సంఘాలకు రుణాల చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని.. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపంజాణి మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగ గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. గోకులం షెడ్ల నిర్మాణంలో జిల్లాలోనే పెద్దపంజాణి మండలం ముందంజలో ఉందని రైతులను అభినందించారు. అనంతరం మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన మెగా రుణమేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అంచలంచలుగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి వినూత్న పథకాలను తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతంగా నిలపడానికి కృషి చేస్తున్నారన్నారు. తరలిపోయిన పరిశ్రమలు సైతం చంద్రబాబునాయుడు పాలన చూసి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. దీంతో మహిళల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ అన్నారు. అనంతరం మండలంలోని 1053 మహిళా సంఘాలకు రూ.18. 83 కోట్ల రుణాల చెక్కును అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీ, నాయకులు మురహరిరెడ్డి, యువ నాయకులు నాగరాజరెడ్డి, సుధాకరరెడ్డి, శ్రీరాములు, రోజా రెడ్డి, నాగరాజ, మురళీకృష్ణ, భానుప్రతాప్‌రెడ్డి, చలపతి, బావాజాన్, జిలానీ, గంగప్ప, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

●పెద్దపంజాణి: ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారుల పనితీరు, సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీఈవో బాలాజీ, తహశీల్దారు, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, విద్యుత్‌శాఖ, గృహనిర్మాణశాఖ, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పశువైద్యశాఖ, ఆరోగ్యశాఖ, అధికారులు పాల్గొన్నారు.

వసతులు ఎలా ఉన్నాయ్?

వరసిద్ధుడి భక్తులతో ముచ్చటించిన దేవదాయ శాఖ కమిషనర్



భక్తులతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ఐరాల(కాణిపాకం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వసతులు ఎలా ఉన్నాయని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆరా తీశారు. శుక్రవారం స్వామిదర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ముచ్చటించారు. అనంతరం అన్నదాన భవనంలో భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. తర్వాత మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మాణంలోని అన్నదాన భవనం, వినాయక సదన్‌లో నిర్మిస్తున్న 3,4 అంతస్తులను పరిశీలించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల ఏసీలు చిట్టెమ్మ, రామకృష్ణారెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవరదుడికి వైభవంగా గరుడ సేవ



యాదమరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుడికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైభవంగా గరుడసేవ నిర్వహించారు. శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత ఇంద్రవరద మూలవర్లకు పుష్పకైంకర్యం, అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గరుడ సేవకు ప్రత్యేకంగా ఓ విశిష్టత ఉంది. ముఖ్యంగా రాజగోపుర దర్శనం, ఆపై ఆకాశంలో గరుత్మంతుడు ప్రత్యక్షమై రాజగోపురం మీద చక్కర్లు కొట్టడం విశేషం. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. శుక్రవారం ఉదయం శ్రీదేవి పెరిందేవి సమేత ఇంద్ర వరదరాజుల స్వామి పక్షిరాజు అయిన గరుడ వాహనంపై సాక్షాత్తు విష్ణుమూర్తి రూపంలో మాడావీధుల్లో విహరించారు. భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. భక్తులకు గ్రామస్థులు అన్నప్రసాదం అందజేశారు.

ఏపీటీఏఎస్ఏ నూతన కార్యవర్గం



చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఏఎస్ఏ) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎస్‌టీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెంగల్రాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా కేఎన్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, గుణశేఖర్, సుకన్య, సెక్రటరీగా పయణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రావు, జాయింట్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, మహ్మద్ తరీఫ్, గుణసుందరి, ట్రెజరర్‌గా వెంకటాచలపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం మూడేళ్లపాటు ఉంటుంది.

కరకమందలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సోమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమందలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రేరణ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు రూ.6 వేలు, రూ.3 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8951490771 (మనోజ్), 9986439392 (ప్రవీణ్) నంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే సోమల శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో మోహన్‌కుమార్ జ్ఞాపకార్థం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. కుప్పం, గుడుపల్లె, మల్లానూరు, కంగుంది ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు గ్రంథాలయంలో

వివేకానంద జీవిత చరిత్రపై పోటీలు

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో వివేకానంద స్వామి జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన జీవితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులకు ఉదయం 9 నుంచి 9.45 గంటల వరకు, 8, 9, 10 తరగతులకు ఉదయం 10 నుంచి 10.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అదేరోజు ఉదయం 11.30 గంటలకు గ్రంథాలయంలోనే ప్రదానం చేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన పిల్లలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

గంగవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం గంగవరం మండలంలోని వైఎస్సార్ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హాట్‌స్పాట్ కేఫ్ క్రికెట్ స్టేడియంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, రాముెరెడ్డి,యుగంధర్, గిరిధర్‌గోపాల్, నాగరాజురెడ్డి, సురేష్‌రెడ్డి, గిరిబాబు, ఖాజాపీర్, చాంద్‌బాష, మదన్, శ్రీధర్, కిరణ్, బీఆర్సీ కుమార్, జనసేన దిలీప్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పారదర్శకంగా పనులు

గుడుపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని పీడీ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1,85,631 రికవరీకి పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డీవీవో శివయ్య, ఎస్‌టీఎం లోకేష్ రెడ్డి, ఏపీవో ధనయ్య పాల్గొన్నారు.

బోరుకు విద్యుత్తు కనెక్షన్ తొలగించాలని ధర్నా



గుడుపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లె గ్రామంలో తాగునీటి బోరు పక్కన ఉన్న బోరుకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలని గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. తాగునీటి బోరు పక్కనే మరో వ్యక్తి బోరుబావి ఏర్పాటు చేశారన్నారు. దీంతో వేసవిలో తమకు తాగునీటి సమస్య ఏర్పడుతోందని .. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్తు కనెక్షన్ తొలగించాలని డిమాండు చేశారు. అధికారులు చేరుకుని సర్ది చెప్పడంతో విరమించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



విద్యార్థులతో శాంత నాగరాజ్

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, ప్రధానోపాధ్యాయురాలు వి.దమయంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు వీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదలి తెలిపారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరించి నిరసన



మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ప్రజాప్రతినిధుల నిరసన

పలమనేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను అధికారులు అమలు చేయడం లేదని.. అయితే మండల సమావేశాలు ఎందుకని అధికారులను సభ్యులు నిలదీశారు. శుక్రవారం పలమనేరు మండల సర్వసభ్య సమావేశాన్ని సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోను గత తీర్మానాలను మూడు నెలలు కావస్తున్నా నేటికి అమలు చేయలేదని ప్రశ్నించారు. తాను ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నానని.. అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ ఎంపీపీ రోజా, జడ్పీటీసీ మల్లిక కింది కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. కార్యాలయం ఎదుట అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నారాయణ

సోమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పల్లెలో సాగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. శుక్రవారం సోమల మండలంలోని వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లె, నెల్లిమంద తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, గోకులాల షెడ్‌లను పరిశీలించారు. నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. జేఈ రెడ్డెప్ప, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం ఎంపీడీవోపై జడ్పీ సీఈవోకు ఫిర్యాదు



సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు

గంగవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వని గంగవరం ఎంపీడీవో సురేష్‌బాబు మాకొద్దని జడ్పీటీసీ పార్వతి, ఎంపీపీ వెంకటరమణ శుక్రవారం చిత్తూరులో జడ్పీ సీఈవో రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద ఇవ్వడం లేదని వాపోయారు. నిధులను దుర్వినియోగం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ ప్రహ్లాద, సర్పంచులు గిరి రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల యాజమాన్యంతో దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సదుం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): యాప్‌తో యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రాతివారిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని చెరువుముందరపల్లె సమీపంలో సాగైన పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పుంగనూరు ఏడీఏ శివకుమార్, రైతు శిక్షణ కేంద్రం ఏవో లక్ష్మీప్రసన్న, ఏవో మాధవి, ఏఈవో ఖాదర్‌వలీ, వీఏఏస్‌లు మనీషా, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో కలిసి చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి నుంచి తహసీల్దార్ కార్యాలయాల వద్ద వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డీటీ నాగేశ్వర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామమూర్తి, రత్నమ్మ, పరమేశ్వర్, కిషోర్, రాజమ్మ, కవిత, శాంతమ్మ, జరీనాబి పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి

పుంగనూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు రాంపల్లెలోని డయాలసిస్ కేంద్రాన్ని ఆమె పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ శివ, సరళకుమారి, వరదారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, సురేశ్, మహిపాల్‌రెడ్డి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీల్లో రుచికర ఆహారం



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు అన్న క్యాంటిన్‌లో ఆహారం రుచికంగా ఉందని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అన్న క్యాంటీన్ పరిసరాలు, శుభ్రత, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



పలమనేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం మున్సిపల్‌ఛైర్‌పర్సన్ ఛాముండేశ్వరి మున్సిపల్ హాల్‌లో నూతన దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎస్‌వీ రమణారెడి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు లోకేష్ ప్రశంసలు



విద్యార్థులను అభినందిస్తున్న నారా లోకేశ్

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన ఎస్.శివశంకర్, ఆర్.శ్యామ్‌సన్ అనే విద్యార్థులు చిత్తూరు జిల్లా యువ ఉత్సవ్ సైన్స్ మేళాలో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పాలిటెక్ సైన్స్ ఫెస్ట్‌కు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 6, 7 తేదీలలో జరిగిన పాలిటెక్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. చేతులు కాళ్లు లేనివారికి తక్కువ ఖర్చుతో ఆహారం అందించే 'లో కాస్ట్ ఫుడ్ ఫీడర్ ఫర్ లిమ్‌లెస్ పీపుల్' అనే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించిన కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులను అభినందించారు. శుక్రవారం కళాశాల చేరుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ జగన్నాథరావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ విభాగాధిపతి సీహెచ్.సుబ్బన్న, అధ్యాపకులు నరసింహులు, నిరంజన్, వరుణ్ కుమార్, విక్టర్ జోసెఫ్‌లు ప్రత్యేంగా అభినందించారు.

పశువుల కాపరిపై దాడి

పుంగనూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గడ్డిని మేపారని పశువుల కాపరిపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలిలా.. పుంగనూరు మండలం కమ్మరగుంట క్రాస్‌రోడ్డు వద్ద అదే గ్రామానికి చెందిన గంగులప్ప పశువుల కోసం గడ్డిని పెంచారు. పక్క గ్రామానికి చెందిన జ్ఞానేంద్రరెడ్డి పశువులను మేపుతుండగా పశువులు గడ్డి ఉన్న పొలంలోకి వెళ్లాయి. దీంతో గంగులప్ప జ్ఞానేంద్రరెడ్డిని దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న కన్నన్

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం కొత్తపేటకు చెందిన ప్రేమ అనే టీడీపీ మహిళా కార్యకర్త కాలి ఎముకకు ప్రమాదవశాత్తు గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ విస్తరణ విభాగం సభ్యుడు కన్నన్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకు ఆర్థిక సాయం అందించారు. బాధితురాలు దన్యవాదాలు తెలిపారు.

కేటాయింపులకే బడ్జెట్ పరిమితం



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాముండేశ్వరి

పలమనేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీల కోసం మున్సిపల్ వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారు తప్ప.. గత కొన్నేళ్లగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని మున్సిపల్ కౌన్సిలర్ శ్యాంసుందర్‌రాజ్ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో 2024-2025 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, 2025-26 సంవత్సరపు వార్షిక బడ్జెట్ అంచనాలకు సంబంధించి తయారు చేసిన బడ్జెట్ ప్రతిపాదనల ఆమోదం కోసం శుక్రవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డిని ప్రశ్నించారు. అనంతరం బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్.ఓ రవిరెడ్డి, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట సచివాలయ సిబ్బంది నిరసన

పలమనేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు సచివాలయాల సిబ్బంది శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎన్జీవో సంఘ నాయకులు ఆనందబాబు, లక్ష్మీపతి యాదవ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయాలని.. సంక్రాంతికి ప్రభుత్వం మూడు రోజులు సెలవు ప్రకటించినా విధులకు హాజరు కావాలని అధికారులు ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. అనంతరం వారు మున్సిపల్ కమిషనర్ ఎస్‌వీ రమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.

మల్లానూరు, గుడుపల్లె స్టేషన్లలో రైళ్లను ఆపాలి



కుప్పంలో డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కుప్పం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం, గుడుపల్లె రైల్వే స్టేషన్లలో ఎప్పటిలాగే రైళ్లను ఆపాలని మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, సాయి మాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, టీడీపీ నాయకులు, స్థానికులు రైల్వే అధికారులను కోరారు. కుప్పం రైల్వే స్టేషన్‌కు శుక్రవారం వచ్చిన సౌత్ వెస్ట్రన్ రైల్వేస్ డీఆర్ఎంను వారు కలిశారు. మూడో ప్లాట్‌ఫాం నిర్మాణ నేపథ్యంలో ఈనెల 21 నుంచి ఫిబ్రవరి 8వ వరకు బెంగళూరు వైపు రాకపోకలు సాగించే రైళ్లను కుప్పంలో నిలపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతారని విన్నవించారు. ఈ విషయమై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని డీఆర్ఎం వారికి చెప్పారు.

ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలి

● హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్

సోమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా హౌసింగ్ అధికారి (పీడీ) గోపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం సోమల హౌసింగ్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ ఉద్యోగులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో మూడు రోజులు పాటు స్పెషల్ డ్రైవ్‌గా ఐహెచ్‌ఎల్ పనులు పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ ఉద్యోగులు తమ పరిధిలోని గృహ నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లల్లో మరుగుదొడ్లు తప్పని సరిగా నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఇన్‌చార్జి అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 11న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలమనేరు, గంగవరం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



మామిడి పూత అంతంతమాత్రం..!

● గత మూడేళ్లుగా తగ్గిన కాపు
● తోటలను కొనేందుకు ముందుకురాని వ్యాపారులు
● ప్రతికూల వాతావరణంతో నష్టాల్లో రైతులు

వర్షాలతో మామిడిలో పూత ఆలస్యం



అకాల వర్షాల కారణంగా మామిడి పంటలో పూత, మొగ్గలు ఏర్పడటం ఆలస్యమైంది. నీటి శాతం ఎక్కువ కారణం. పూత రావడానికి మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్, బోరాన్ 2 గ్రాములు, 13.0.45 10 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలి.

- సంతోషికుమారి, ఉద్యానశాఖాధికారిణి

రొంపిచెర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ మార్పులతో మామిడి రైతులకు ఈ ఏడాదీ భారీ నష్టం జరుగనుందని రైతులు ఆందోళనలో పడ్డారు. వర్షాల సీజన్ ముగిసి తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గ వస్తున్న లక్షణాలు సైతం కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు. దీంతో తోటలు కొనుగోలు చేసే వ్యాపారులు ముందుకు రావడంలేదు. నియోజకవర్గంలోని ఐదు మండలాలో ఇదే పరిస్థితి నెలకొంది. పంట దిగుబడులు బాగుంటే చేసిన అప్పులు తీరుతాయని ఆశ పడుతుంటారు. అయితే పంట చేతికొచ్చే వరకు ఏ ముంపు ఎటునుంచి వస్తుందో తెలియని పరిస్థితి. ఇప్పుడు ఇదే పరిస్థితి మామిడి రైతుల్లో కనిపిస్తోంది. వాతావరణంలోని ప్రతికూల పరిస్థితులతో పంట దెబ్బతింది. తోటల్లో పూత, కాడలకు మొగ్గలు రాక దిగాలు చెందుతున్నారు. గత మూడేళ్లుగా కాయల దిగుబడులు ఆశించినంత రాకపోవడంతో మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి వస్తుందేమోనని భయపడుతున్నారు. తోటల సాగు.. ఎరువులు.. సస్యరక్షణ తదితర సేద్యం ఖర్చులకు భారీగా పెట్టుబడులు పెట్టుకుంటూ వస్తున్నారు. నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలంలో 2500, సోమలలో 5000, పులిచెర్లలో 12000, సదుంలో 5500, రొంపిచెర్ల మండలంలో 5200 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పంట దిగుబడులు రాకుంటే రైతుల అధికంగా నష్టపోయే అవకాశాలు ఉండటం గమనార్హం.



పలమనేరులో పూత కనిపించని మామిడిచెట్టు

వ్యాపారులు మొగ్గు చూపడంలేదు



తోటల్లో పూత, పిందెలు కనిపిస్తున్నపుడు వ్యాపారులు అంచనాలు వేసి ముందుగానే తోటలపై పెట్టుబడులు పెట్టడానికి మక్కువ చూపేవారు. అయితే ఈఏడాది అలాంటి పరిస్థితులు లేవు. నాకున్న 9 ఎకరాల్లో పూత కోసం మందులు పిచికారీ చేస్తూనే ఉన్నాను. ఈ ఏడాది దిగుబడులు తగ్గితే నష్టం చూడాల్సి వస్తుంది. - పోతబోలు రామమూర్తి, రైతు, బోణంవారిపల్లె, రొంపిచెర్ల మండలం

మూడేళ్లుగా నష్టాలు తప్పలేదు



నాకు ఏడు ఎకరాల్లో మామిడి తోట ఉంది. ప్రతి ఏడాది తోటలకు సస్యరక్షణ చర్యలు, ఎరువులు వాడకం, సేద్యపు పనుల కోసం రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. అయితే నేడు దిగుబడులు తగ్గిపోయి భారంగా మారుతోంది. గత మూడేళ్లుగా నష్టాలు చూస్తూనే ఉన్నాం.

- అమరనాథరెడ్డి, రైతు, గానుగచింత, రొంపిచెర్ల మండలం

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



కల్లూరులో గోవుకు హారతి ఇస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. పంచాయతీల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు, శ్మశాన వాటికల ప్రహరీలు, వీధిలైట్లు, తాగునీరు తదితర అభివృద్ధి పనుల అవసరాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, తహశీల్దార్ జయసింహ, నాయకులు రామనాథం నాయుడు, మురళీధర్, ఉయ్యాల రమణ, ఆనంద నా యుడు, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, వెంకటరమణ, మురళీధర్‌నాయుడు, సుబ్బారెడ్డి, ఖాదర్‌వల్లి, గోపినాయుడు, మహేష్, రమేష్, కరుణాకర్‌నాయుడు, అనీల్‌కుమార్, అబ్బాస్, నజీర్, ధనంజయనాయుడు, షుకూర్, ప్రసాద్, ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

●చౌడేపల్లె: పాడి రైతుల అభివృద్ధి కోసమే గోకులం పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చారాలలో గోకులంషెడ్‌ను ఎంపీడీవో లీలామాధవితో కలిసి ఆయన ప్రారంభించారు. టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, కళ్యాణ్, మంజు, చంద్రమౌళి, నారాయణరాజు, గణి, కుమార్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, ఏపీఎం చిన్నరెడ్డమ్మ, పశువైద్యాధికారి పవన్‌కుమార్, టీఏ ధనంజయుడు, అమరనాథ్, జేఈ కొడండపాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

●సోమల: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం పల్లెలో రైతు రమణయ్య గోకులం షెడ్‌ను టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, కార్యదర్శులు జయరాం, జయశంకర్, జేఈ రెడ్డెప్ప, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, రెడ్డి మోహన్, బాలకృష్ణమనాయుడు, పి.రమణయ్య, శ్రీనివాసులు, శివశంకర్, మహేంద్రబాబు, విశ్వనాథం, ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: కల్లావారిపల్లెలో రూ2.30 లక్షల వ్యయంతో పాడి రైతు వెంకట్రమణనాయుడు నిర్మించిన గోకులం షెడ్డును శుక్రవారం టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు అమరనాధరెడ్డి, మధు, కృష్ణమనాయుడు, శేషాద్రినాయుడు, మదనమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అమరనాధరెడ్డి, ఎంపీడీవో మదనమోహన్‌రెడ్డి, ఏపీడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేననేత విరూపాక్షి తెలిపారు. శుక్రవారం మండలంలోని పూజగానిపల్లెలో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధవిలత, ఏపీవో శివకుమార్, కూటమి నాయకులు సీవీ.రెడ్డి, పగడాల రమణ, చిన్నారాయల్, చైతన్యరాయల్, రాఘవ, గంగాధర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రమణ, హరినాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: మండలంలోని గుంతకురప్పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులంషెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు తదితరులు తపాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి






చౌడేపల్లెలో వేణుగోపాలస్వామి, పుంగనూరులో శ్రీకళ్యాణ వెంకటరమణస్వామి, సోమల మండలం ఆవులపల్లెలో వేంకటేశ్వరస్వామి



భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించిన లక్ష్మీపురం వరదరాజస్వామివారు



వి.కోటలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి



కడపనత్తంలో విశేషాలంకరణలో నలగుండ్రాయస్వామి

కుప్పం, పలమనేరు, పుంగనూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజక వర్గాల్లోని అన్ని మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ఆలయాల్లోని స్వామి అమ్మవార్లకు వివిధ అభిషేకాలు చేసి ప్రత్యే టకంగా అలంకరింపజేశారు. వైకుంఠ ద్వార దర్శనంతో భక్తుల సందడి నెలకొంది. అన్నదానాలు చేపట్టారు. గత రెండు రోజుల నుంచి భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి





పలమనేరు అలంకరణలో కళ్యాణ వెంకటరమణ స్వామి, అమ్మవార్లు



పుంగనూరు: అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



కీలపట్ల ఆలయం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు



రఘురామకృష్ణరాజు



నిమ్మల రామానాయుడు



హోం మంత్రి అనిత



రామ్మోహన్‌నాయుడు



చాముండేశ్వరీనాథ్, పుల్లెల గోపిచంద్

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వారిలో.. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు అనిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారధి, నిమ్మల రామానాయుడు, సవిత, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ రెడ్డి, గుమ్మనూరు జయరాం, బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, జగన్మోహన్, మురళిమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, శ్రీకృష్ణదేవరాయులు, మిధున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, కంచర్ల శ్రీకాంత్, కల్యాణి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ, సుహాసిని, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, సినీ నటుడులు రాజేంద్రప్రసాద్, సప్తగిరి, నిర్మాత బండ్ల గణేష్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, ఇండియన్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ ఉన్నారు.



ఇల వైకుంఠం

- పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ













శ్రీవారి ఆలయంలో దాదాపు 5 టన్నులు.. వెలుపల మరో 5 టన్నుల పుష్పాలు.. 1.20 లక్షల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణలే. విద్యుద్దీపాలంకరణలతో తిరుమల 'ఇల వైకుంఠం'గా మారింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మనసుదోచే విద్యుత్, పుష్పాలంకరణలో స్వామి కొండను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. శ్రీవారి ఆలయం ముందు వేసిన 'రంగనాథస్వామి ఆలయ' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి దర్శనం అనంతరం భక్తులందరూ ఈ సెట్టింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు. పూలు, పండ్లతో చేసిన దేవతల అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈసారి మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో అలంకరణలు చేపట్టడంతో భక్తులు నూతన అనుభూతులను పొందుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహావిష్ణువు, శ్రీలక్ష్మీదేవి, గరుడ ఇతర దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు, సప్తగిరి వద్ద విద్యుత్ సప్త ద్వారాలు కూడా శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తొలిరోజు ప్రశాంతంగా..

- శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు
- స్వర్ణరథంపై ఊరేగిన స్వామివారు.. నేడు చక్రస్నానం



తిరుమల, జనవరి10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులతో తిరుమల కొండ సందడిగా మారింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను వేకువజామున 4.30 గంటలకు మొదలుపెట్టాలని అనుకున్నప్పటికీ.. ధనుర్మాసం కైంకర్యాలు కైంకర్యాలు త్వరగా పూర్తికావడంతో 3.50 గంటలకే దర్శనాలు మొదలయ్యాయి. ఉదయం 8.15 గంటల వరకు సుప్రీం, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులకు దర్శనం చేయించారు. ఆ తర్వాత టోకెన్లు పొందిన సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ల వారీగా దర్శనం చేయిస్తామన్నారు. ఇక, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంలో వేంచేపు చేసి ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథాన్ని టీటీడీ మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు లాగారు.

ఇబ్బంది పెట్టిన గేట్లు

శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన గేట్లతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఒకచోటు నుంచి మరోచోటికి వెళ్లేందుకు అవస్థ పడ్డారు. స్వర్ణరథం నిర్వహించే సమయంలో అక్కడక్కగా గేట్లను మూసివేయడంతో పిల్లలతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. వృద్ధులు, మహిళలు కూడా గేట్లను ఎక్కిదూకుతూ కనిపించారు. తిరుమలలో చలి భక్తులను గజగజ వణికించింది. శుక్రవారం మొత్తం ఎండ లేకపోవడంతో పాటు పొగమంచు ఉక్కిరిబిక్కిరి చేసింది.

మిగిలిపోయిన గదులు?

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పద్మావతి పరిధిలోని వందకుపైగా గదులు మిగిలిపోయినట్టు తెలిసింది. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజు గదుల పొందాలంటే శ్రీవారి దర్శనాని కంటే కష్టంగా భావిస్తారు. అలాంటిది శుక్రవారం ఏకంగా దాదాపు వంద గదులు ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉండిపోయినట్టు సమాచారం. వివిధ రకాల ప్రముఖుల కోసం వీటిని ఎవరికి కేటాయించకుండా వదిలేసినట్టు తెలిసింది. మరోవైపు గదులు లభించక చాలా మంది భక్తులు తీవ్రమైన చలిలో ఉండిపోయారు. కనీసం వారికైనా వీటిని కేటాయించి ఉంటే బాగుండేదంటూ పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

రేపు తిరుపతికి సీఎం

- నాలుగు రోజులు జిల్లాలో ఉండనున్న చంద్రబాబు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పర్యటించే ప్రాంతాలను తనిఖీ చేశారు. తాజ్ హోటల్‌లో పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అప్రమత్తంగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామమోహన్ పాల్గొన్నారు. కాగా, ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు.. నాలుగు రోజులపాటు జిల్లాలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుచానూరు ముఖద్వారం (బసీన్ ఫ్యాక్టరీ) సమీపంలో శంకర్‌రెడ్డి నివాసంలో ఏజీఅండ్‌పీ గ్యాస్ సంస్థ ఇంటింటికి ఏర్పాటు చేసిన గ్యాస్ కనెక్షన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం 2.20 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని, ఏజీ అండ్‌పీ గ్యాస్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక్కడి వరకు అధికారనిక పర్యటన ఖరారైంది. కాగా, సాయంత్రం నారావారిపల్లెకు చేరుకుని పండుగ సందర్భంగా 13, 14, 15 తేదీల్లో చంద్రబాబు అక్కడే ఉంటారు. 15వ తేదీన మధ్యాహ్నం తిరుగు ప్రయాణమవుతారని అధికారులు వెల్లడించారు.

స్వగ్రామాలకు 32 మంది



వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటలో గాయపడిన వారిలో 32 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. వారికి అధికారులు శ్రీవారి దర్శనం చేయించి ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు పంపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఫొటో దిగారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ పోరాటాలు



మీడియాతో మాట్లాడుతున్న కృష్ణయ్య

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 10(ఆంధ్రజ్యోతి): బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరికి న్యాయం చేయడానికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. శనివారం తిరుచానూరులోని ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో జరిగే ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ 19వ మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జల్లి మధుసూదన్, నూకాలమ్మ, జగన్నాథం, సుగుణపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై విచారణ

- క్యూలైన్ల వద్ద ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై ప్రభుత్వం సీరియస్



క్యూలైన్ల వద్ద కానరాని వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే కారణంతో ప్రభుత్వం ఆ శాఖ అధికారులను వివరణ కోరినట్లు సమాచారం. గాయపడిన వారికి సకాలంలో వైద్య సాయం అందలేదని, ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్సు కూడా అందుబాటులో లేదని అధికారుల విచారణలో తేలింది. సాధారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు చేరే ప్రదేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలి. తప్పక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా అంబులెన్సులను అందుబాటులో ఉంచాలి. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగిందని అధికారుల విచారణలో తేలడంతో ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.

షికారీల భూసమస్యను పరిష్కరించండి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ఏర్పేడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురం షికారీ కాలనీకి చెందిన షికారీల భూ సమస్యను పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హుస్సేన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 1979లో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో తమకు ఒక్కో కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున 120 కుటుంబాలకు అందించారని షికారీల ఉద్యమనేత పరశునాథ్ చెప్పారు.20ఏళ్ల క్రితం పొట్ట కూటి కోసం పట్టణాలకు వలస వెళ్లామన్నారు. అదేదను గా భావించిన కొంతమంది రైతులు తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు షికారీల భూ సమస్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వారికి న్యాయం చేయాలని హుస్సేన్ ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీ ఎస్టీ కమిషన్ సభ్యుడు

కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు

● కలెక్టర్ సుమిత్ కుమార్



కోడిపందేల నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహించటం చట్ట రీత్యానేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ కోడి పందేల నిషేధంపై ముద్రించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించినా, పాల్గొన్నా క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

21న ఏకసభ్య కమిషన్ విచారణ

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణపై ఈనెల 21వ తేదీన చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా బృందం విచారణ చేపట్టనుంది. ఈ విచారణకు జిల్లాలోని ఎస్సీ కులాలు, పౌరుల నుంచి సిఫార్సులను స్వీకరిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

16న ఐటీఐలో మెగా జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాకు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో శిక్షణ పూర్తిచేసి పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటీస్ ఐటీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, లేదా తమ కార్యాలయంలో జరిగే మేళాకు నేరుగా హాజరుకావాలని కోరారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90306 57957 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఇరువర్గాల ఘర్షణ : నలుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



ప్రసన్నయ్యగారిపల్లెలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు - కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం



పుంగనూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ విషయంపై ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రభుత్వ భూమి కబ్జా చేశారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు తహసీల్దార్ రాముతోపాటు అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఆ శ్రీనివాసులు తమ కుటుంబసభ్యులు జగదీశ్, శివలతో కలిసి గ్రామస్తులతో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంను శ్రీనివాసులు కత్తితో కడుపుపై పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆంజప్ప కుమారుడు చంద్రశేఖర్, రెడ్డెప్ప కుమారుడు ఆనంద్, రాజేంద్రలు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కత్తిపోటుకు గురైన సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉందని, డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించారు. విషయం తెలుసుకున్న పుంగనూరు సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




కొబ్బరి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు - టమోటా పంటను నాశనం చేసిన ఏనుగు

పొలాలపై 13 ఏనుగుల గుంపు దాడి

● భయాందోళనలో రైతులు



మామిడి కొమ్మలను ధ్వంసం చేసిన గజరాజులు

బంగారుపాళ్యం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎగువ కంతలచెరువు పొలాలపై 13 ఏనుగుల గుంపు దాడి చేస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి కూడా గ్రామానికి చెందిన శంకరయ్య, నాగభూషణం, దేవేంద్ర, గురుమూర్తిలకు చెందిన పంటలను తొక్కినాశనం చేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో మోహన్ మురళి శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టాన్ని అంచనా వేశారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి 13 ఏనుల గుంపు వచ్చి ఉంటుందని, అలాగే వెలుతురుచేను ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తోందన్నారు. ట్రాకర్లు, అటవీ సిబ్బంది గస్తీ కాస్తూ వాటి కదలికలను తెలుసుకుంటున్నామన్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో ఉన్న రైతులు రాత్రి వేళల్లో జాగ్రత్తలు పాటించాలని, గుడిసెల్లో నిద్రించరాదని హెచ్చరించారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

● సహకరించిన ప్రియుడికి కూడా



పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు లీగల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్తను చంపేసింది. ఈ కేసులో భార్య, ప్రియుడికి చిత్తూరు న్యాయస్థానం జీవితఖైదు విధించింది. చిత్తూరు అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు సొంతంగా లారీలు కొని బయటి ప్రాంతాలకు వెళుతుంటాడు. ఈయన వద్ద రొంపిచెర్ల మండలం మొరవపల్లెకు చెందిన బాబులాల్ తమ్ముడు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. బాబులాల్ అప్పుడప్పుడు తన తమ్ముడి కోసం అంబేడ్కర్ నగర్‌కు వస్తూ శ్రీనివాసులు భార్య లక్ష్మితో పరిచయం పెంచుకున్నాడు. అదికాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. 2017 సెప్టెంబరు 11వ తేదీన బాబులాల్, లక్ష్మిలు ఇంట్లో ఉండగా భర్త గమనించాడు. తమ విషయం తెలియడంతో శ్రీనివాసులును లక్ష్మి, బాబులాల్ కలిసి రాడ్డుతో కొట్టి చంపేశారు. కేసు నమోదు చేసిన చిత్తూరు రెండో పట్టణ పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం ఎనిమిదో అడిషనల్ జిల్లా కోర్టులో వాయిదాకురాగా నేరం రుజువైంది. దీంతో నిందితులకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుంకర శ్రీదేవి తీర్పు చెప్పారు. ఈ కేసును ఇన్‌చార్జి పీపీ రవీంద్రనాథరెడ్డి వాదించారు.





ఉపలోకాయుక్త రజనికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో - అడిషనల్ డీజీపీకి జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు - దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్, ఏసీ చిట్టెమ్మ

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



స.హ చట్టం కమిషనర్ చావలిసునీల్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం),జనవరి10(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్, రాష్ట్ర అడిషినల్ డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ కృష్ణమోహన్, ఏపీ సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈపై

సీఎం కార్యాలయానికి ఉద్యోగిని ఫిర్యాదు

● అవమానకరంగా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నారని జేసీ వద్ద ఆవేదన

చిత్తూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈపై ఓ ఉద్యోగిని సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) తనను అవమానకరంగా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నాడని ఏఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని ఆరోపించారు. ఈ మేరకు సీఎం కార్యాలయంతోపాటు కలెక్టర్, ఇంజనీర్‌ఇన్‌చీఫ్(ఆర్అండ్‌బీ),ఎస్పీ, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరిని కలసి తన సమస్యను వివరించారు. 'డిప్యూటీ ఎస్ఈ నా విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. చాంబర్‌కు పిలిచి దుర్భాష లాడుతూ, కాంట్రాక్టర్ల ముందు ఫైల్స్‌ను మొహంమీద విసిరి కొడుతున్నారు. ఆఫీస్ సమయం ముగిశాక నన్ను మాత్రమే ఇంటికి వెళ్లేటపుడు చెప్పి వెళ్లాలని ఆదేశిస్తున్నారు. ఇంటికెళ్లాక నా చాంబర్‌లోని ఫైళ్లు కనపడకుండా చేస్తున్నారు. రోజూ పిలిచి ఏదో ఒక కారణంతో తిడుతున్నారు' అని ఆ ఉద్యోగిని జేసీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఇదే ఎస్ఈ గతంలో విధులు నిర్వహించిన ప్రాంతంలో కూడా తమను వేధిస్తున్నారని పలువురు మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయని సదరు ఉద్యోగిని తెలిపారు.

విజయం సీబీఎస్ఈలో ఘనంగా వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో విజయం విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరరాజపురం విజయం సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం ఐదవ వార్షికోత్సవాన్ని విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చిత్తూరు శాఖ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని చెప్పారు. అకడమిక్ విజేతలతో పాటు, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు పలు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం

చిత్తూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని పూతలపట్టు మండలం మినహా అన్ని మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చిత్తూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కొత్త ఉద్యోగాలను కల్పించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కోదండయ్య, నాగరాజు, మణి, విజయ్‌కుమార్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు అభివృద్ధి కోసం పవన్‌కు విజ్ఞప్తి

పెనుమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాశారు. గత పాలకుల, అధికారుల నిర్లక్ష్యం వలన పంచాయతీకి ఏడాదికి రూ.కోటి ఇరవై లక్షల ఆదాయం కోల్పోతోందని పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెనుమూరు పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

ఆర్ఎంపీ క్లినిక్ తనిఖీ

యాదమరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో నిర్వహిస్తున్న ఓ ఆర్ఎంపీ క్లినిక్‌ను వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణలు తనిఖీ చేశారు. యాదమరిలో ఆర్ఎంపీ ఆర్ముగం నిర్వహిస్తున్న క్లినిక్‌ను శుక్రవారం వైద్య బృందం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు మాత్రమే అందించాలని, పరిధికి మించి ఎవరికి పడితే వారికి సూదిమందు ఇవ్వడం, సెలైన్లు ఎక్కించడం లాంటివి చేస్తే కఠినచర్యలు చేపడతామని డాక్టర్ సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

వడ్డే ఓబన్న జయంతిని విజయవంతం చేయండి

చిత్తూరు అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఛలో వడ్డెర చిత్తూరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిత్తూరులో నిర్వహిస్తున్న వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు పిలుపునిచ్చారు. ఓబన్న జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై శుక్రవారం ఆ సంఘ నాయకులతో కలిసి ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గాంధీ విగ్రహం వద్దకు సంఘనేతలు, వడ్డెర కులస్థులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఆ సంఘ ఉపాధ్యక్షుడు గుర్రప్ప, పూతలపట్టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధరణీప్రకాష్, నేతలు హరిబాబు, రుద్రయ్య, మురళి, కుసుమ, సుమిత్ర పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

పాలసముద్రం, జనవరి10(ఆంధ్రజ్యోతి): బాలాకృష్ణాపురం పంచాయతీ అలివేలు మంగాపురంలో నరసింహులు కుమారుడు అరుణాచలం నాటుసారా తయారుచేస్తుండగా పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అరుణాచలం పరారయ్యాడు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సారాఊటను ధ్వంసంచేసి, అరుణాచలంపై కేసు నమోదు చేశారు.

వసతులు ఎలా ఉన్నాయ్?

వరసిద్ధుడి భక్తులతో ముచ్చటించిన దేవదాయ శాఖ కమిషనర్



భక్తులతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ఐరాల(కాణిపాకం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వసతులు ఎలా ఉన్నాయని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆరా తీశారు. శుక్రవారం స్వామిదర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ముచ్చటించారు. అనంతరం అన్నదాన భవనంలో భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. తర్వాత మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మాణంలోని అన్నదాన భవనం, వినాయక సదన్‌లో నిర్మిస్తున్న 3,4 అంతస్తులను పరిశీలించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల ఏసీలు చిట్టెమ్మ, రామకృష్ణారెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవరదుడికి వైభవంగా గరుడ సేవ



యాదమరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుడికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైభవంగా గరుడసేవ నిర్వహించారు. శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత ఇంద్రవరద మూలవర్లకు పుష్పకైంకర్యం, అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గరుడ సేవకు ప్రత్యేకంగా ఓ విశిష్టత ఉంది. ముఖ్యంగా రాజగోపుర దర్శనం, ఆపై ఆకాశంలో గరుత్మంతుడు ప్రత్యక్షమై రాజగోపురం మీద చక్కర్లు కొట్టడం విశేషం. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. శుక్రవారం ఉదయం శ్రీదేవి పెరుందేవి సమేత ఇంద్ర వరదరాజుల స్వామి పక్షిరాజు అయిన గరుడ వాహనంపై సాక్షాత్తు విష్ణుమూర్తి రూపంలో మాడావీధుల్లో విహరించారు. భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. భక్తులకు గ్రామస్థులు అన్నప్రసాదం అందజేశారు.

ఏపీటీఏఎస్ఏ నూతన కార్యవర్గం



చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఏఎస్ఏ) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎస్టీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెంగల్రాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా కేఎన్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, గుణశేఖర్, సుకన్య, సెక్రటరీగా పయణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రావు, జాయింట్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, మహ్మద్ తరీఫ్, గుణసుందరి, ట్రెజరర్‌గా వెంకటాచలపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం మూడేళ్లపాటు ఉంటుంది.

పల్లెలో సంక్రాంతి శోభ

విజయపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెల్లో సంక్రాంతి శోభ మొదలైనది. శుక్రవారం నుంచి పాఠశాలకు సెలవు ప్రకటించడంతో పిల్లలు భోగి మంటలు వేయడానికి కంపలను సమకూర్చే పని ప్రారంభించారు. మండలంలోని ఇళ్లత్తూరు, మాధవరం, కళియంబాకం పంచాయతీల్లో సర్పంచులు దీప్తగోపిరాజు, మమతాశ్రీరాములురెడ్డి, విద్యాభాస్కర్‌రెడ్డి విద్యుత్ దీపాలు ఏర్పాటులో నిమగ్నమయ్యారు. ఇళ్ల ముందు ముగ్గు వేయడం, గొబ్బెమ్మ పెట్టడంతో పల్లెల్లో సంక్రాంతి కళ వచ్చినట్టుంది.

డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

నగరి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం కళాశాల ఆవరణలో వైభవంగా జరుపుకున్నారు. కళాశాల ఆవరణలో పొంగళ్లు పెట్టి, భోగిమంటలు వేశారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌రాజు, ఇందిరాప్రియదర్శిని, సుబ్రమణ్యం, పంకజం, రేవతి, మహేశ్వరి, చినపాపమ్మ, మహేశ్వరి, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడికి నివాళి

శ్రీరంగరాజపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి గ్రామానికి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరాజులు(75) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, మండల అధ్యక్షులు జ్యోతిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా మోర్చా జనరల్ సెక్రటరీ పాముల శేషాద్రి, నాగరాజు, అశోక్‌రెడ్డి, ఢిల్లీబాబు, వాసు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముద్రించిన 2025 నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు, సిటీ అధ్యక్షులు భాను, సభ్యులు మురుగేశ్, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

యాదమరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని ఓటేరుపల్లి పంచాయతీ కె.గొల్లపల్లి (పెద్దబావి దగ్గర) మూడు దశాబ్దాలుగా ప్రజలు నీవానది వాగు దాటి ఎదుర్కొంటున్న దారి సమస్యకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో సర్పంచు పత్తిపాటి భగవతి ఆధ్వర్యంలో రూ.6 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.

ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు చేయించుకోండి

పాలసముద్రం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భిణులు పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు చేయించుకోవాలని డాక్టర్ మోహన్‌కృష్ణ కోరారు. శుక్రవారం 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8 మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, కమల, రేవతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించండి

బంగారుపాళ్యం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని వీఆర్వోలకు, సర్వేయర్లకు తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో డీటీ బాబు, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్యతో సమీక్షించారు.

గోవింద నామస్మరణతో
మార్మోగిన ఆలయాలు



చిత్తూరులో మహాలక్ష్మి, గోదాదేవి అంజనేయ సమేత వెంకటేశ్వరాలయంలో, కోదండ రామాలయంలో రంగనాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు - నగరి కరియమాణిక్యస్వామి ఆలయంలో పూలమాలలతో అలంకరించివున్న వైకుంఠ ద్వారం, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

● ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తరించిన భక్తులు

చిత్తూరు కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో నగరంలోని ఆలయాలు మార్మోగాయి. స్థానిక మహాలక్ష్మి గోదాదేవి అంజనేయ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జామున 4 గంటల నుంచే స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి భక్తులు ఎగబడ్డారు. ఆలయ ట్రస్టీ డి.ఎ.శ్రీనివాస్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నగరంలోని కోదండ రామాలయంలో అర్చక బృందం స్వామి వారి శిఖర దర్శనం నిర్వహించగా, భక్తులు చూసి తరించారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో సీతారామ భజన ఏర్పాటు చేశారు. గొడుగుమూరు శ్రీరామ భజన మందిరం, బజారు వీధి సీతారామ భజన మందిరం, సంతపేట విజయ లక్ష్మి కాలనీ రంగనాథ స్వామి తదితర ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నగరి (ఆంధ్రజ్యోతి): నగరి కరియమాణిక్యస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. షిర్డీ సాయిబాబా, ప్రసన్న అంజనేయస్వామి, సత్రవాడలోని కరియమాణిక్య స్వామి, తెరణిలోనూ వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. బుగ్గఅగ్రహారంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కీళపట్టు వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

విజయపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం శ్రీరామ నామ క్షేత్ర ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. సీతారాముల స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పన్నూరు ఆనందవల్లి సమేత ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

చిత్తూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు పంచాయతీ గోవిందరాజులు గుట్టపై వెలసిన వెంకటేశ్వర స్వామి పాదాలను వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలునిర్వహించారు. దేవదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. తాళంబేడు సర్పంచు అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం సిందురాజపురంలో వెలసిన అభయాంజనేయ స్వామిని గురు బిల్డర్స్ ఉభయదారులుగా ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. బాలాజీ నాయుడు, కేశవులు నాయుడు, రమేష్ నాయుడు, ఆనంద నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, త్యాగరాజు నాయుడు, బాలక్రిష్ణయ్య, బాలరాజు, పూజారి హరిస్వామి, జే.సుబ్రమణ్యం నాయుడు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



వేపంజేరిలో లక్ష్మీనారాయణస్వామిలను దర్శించుకుంటున్న భక్తులు

గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులైన స్వామి, అమ్మవార్లను భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత నారాయణుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఎగపూరు పురవీధుల్లో గరుడ వాహనంపై సీతారాముల చిత్రపటాన్ని వైభవంగా ఊరేగించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బంగారుపాళ్యం (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె దేవరకొండపై వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి పెద్దఎత్తున భక్తులు రావడంతో క్యూలైన్‌లు కిటకిటలాడాయి. ఆలయానికి పుష్పాలను సన్‌గోల్డ్ ఫ్యాక్టరీ మేనేజర్ ధనంజయ నాయుడు సమకూర్చారు. వంశపారంపర్య ధర్మకర్త ఎన్‌పి వెంకటేశ్వర చౌదరి, మేనేజర్ శివయ్య నాయుడు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. స్వామి వారిని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ నాయుడు, జయచంద్ర నాయుడు, ఎన్‌పి సురేంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ సుచిత్ర, ఎన్‌పి ధరణీ దర్శించుకున్నారు.

గోకులం షెడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



ఒరూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒరూరులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గోకులం షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో రాజేంద్ర, ఏపీవో బబిత, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

నింద్ర, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరూరు పంచాయతీ, వడ్డీఇండ్లు, కైపాకం, అత్తి మాంబాకంలో సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవం, కైపాకంలో బస్సు షెల్టర్‌కు భూమి పూజ, నెట్టేరి కూనమరాజుపాలెంలో గోకులం షెడ్‌ల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధ్వాన్నంగా ఉన్న గ్రామీణ రోడ్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, నాయకులు దశరథవాసు, రవి నాయుడు, భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు నాయుడు, రఘుయాదవ్, ఆనందరాజు, వెంకటేశులు నాయుడు, రవికుమార్, మురళీ నాయుడు, బాబుయాదవ్, జగన్, గోపాల్, గాలి రమేష్ నాయడు, కైపాకం సర్పంచ్ గోపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు సమాన వేతనం ఇవ్వాలి

చిత్తూరు అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్లకు సమాన వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ఎన్నికల ముందు అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీ మేర జీతాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద జాతీయ సమితి పిలుపులో భాగంగా అంగన్‌వాడీ సమస్యలపై జేసీ విద్యాధరికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో ఉంటూ మరణించినవారికి రూ.5 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, దాసరి చంద్ర, రమాదేవి పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వెదురుకుప్పం మండలం దేవళంపేటలో భోగి మంటలు

వెదురుకుప్పం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ సాతాల గుణశేఖర్, ఛైర్మన్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

విప్ చొరవతో సమస్య పరిష్కారం

వెదురుకుప్పం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి సమస్య తలెత్తడంతో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన పరిష్కరించారని తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులను విప్ ఆదేశించడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

జూనియర్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

పాలసముద్రం,జనవరి 10: పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. అధ్యాపకులు రమ్య, సుశీల, వినాయకం, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం ఎంపీడీవోపై చర్యలు తీసుకోండి



జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడికి ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

చిత్తూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గంగవరం ఎంపీడీవో సురేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడికి గంగవరం ఎంపీపీ వెంకటరమణ ఫిర్యాదు చేశారు. శుక్రవారం జడ్పీ సీఈవోను కలిసి గంగవరం మండలానికి చెందిన ఎంపీటీసీలతో కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎంపీడీవో కనీస మర్యాద ఇవ్వడం లేదని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 9న జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు హాజరైనప్పటికీ కోరం లేదని సమావేశాన్ని రద్దు చేసి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ కారణంగా మండలంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇందుకు స్పందించిన జడ్పీ సీఈవో... ఎంపీడీవోకు ఫోన్ చేసి అందరినీ కలుపుకుపోవాలని సూచించారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



టీచర్లతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ లావణ్య

గంగాధరనెల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతికి సాంప్రదాయాలకు అద్దం పట్టేది సంక్రాంతి పండుగ అని ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ మద్ది పట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. కోటాగరం పంచాయతీ ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్, శ్రీభానోదయ సీబీఎస్ఈ స్కూల్లో కలిపి ఉమ్మడిగా నాలుగురోజుల ముందుగానే శుక్రవారం సంక్రాంతి పండుగలు దర్శనమిచ్చాయి. విద్యార్థినులు, టీచర్లు వేర్వేరుగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. గాలిపటాలు ఎగురవేసి, మహిళా టీచర్లు పొంగళ్ళు పెట్టడంతో పాటు గొబ్బెమ్మ పాటలు, భోగి మంటలు, హరిదాసు వేషధారణలతో విద్యార్థులు, సాంప్రదాయ చీరకట్టుతో విద్యార్థినులు అలరించారు. గెలుపొందిన విద్యార్థులకు, టీచర్లకు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బహుమతులు పంపిణీ చేశారు. స్కూల్స్ ఇన్‌చార్జులు మణి మేఘల్లై, మౌనిక, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా వెదురుకుప్పం మండలం, ఎగువ పల్లాలు గ్రామమునందు శ్రీ తిమ్మమ్మ తల్లి దేవస్థానము గుడి కలదు. సదరు దేవాలయము, దేవాలయ శాఖ నందు సెక్షన్ 43 ప్రకారం రిజిస్టర్ చేయదలచినాము. ఇందుకు ఏదైనా అభ్యంతరములు వున్న యెడల సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, చిత్తూరు వారి కార్యాలయము నందు 15 రోజులలోపు తెలియజేయగలరు.

ఆలయ కమిటీ, ఎగువపల్లాలు

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

పూతలపట్టు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మగుట్టపల్లె సమీపాన ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రంస్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు.